క్లుప్తంగా

స్ఫూర్తిలో ప్రజస్ఫీ 2కే టెక్ ఫెస్ట్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలో ప్రజస్ఫీ 2కే25 టెక్ ఫెస్ట్ పేరుతో శనివారం వేడుకలు నిర్వహించారు. కళాశాల కార్యదర్శి ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు ఈ ఫెస్ట్‌లో పాల్గొని సందడి చేశారు. ఐడియాథాన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, బ్లైండ్ కోడ్, రోబో ఛాలెంజ్, పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, టెక్ బైక్ లాంటి వివిధ రూపాలలో ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గిరిధర్, న్యాయ నిర్ణేతలుగా డా.విజయ్, డా.సూర్యభూపాల్, డా.ముజీబ్ వ్యవహరించారు. కో–ఆర్డినేటర్లుగా రమేశ్, రాజేశ్‌రెడ్డి, పలు కళాశాలలకు చెందిన హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శనలు

మీర్‌పేట: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయొచ్చని భాష్యం విద్యాసంస్థల జెడ్ఈఓ అంకమ్మరావు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శనివారం మీర్‌పేటలోని భాష్యం లిటిల్ చాంప్స్‌లో నిర్వహించిన ×ఎడ్యు స్పెక్ట్రా×కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రదర్శనలో సోలార్ సిటీ, తోలుబొమ్మలాట, టెరస్ గార్డెన్, చేనేత వస్త్రాలు, పండుగలు, సంస్కృతి సంప్రదాయాలు, వేషధారణలో వైవిధ్యం వంటి అంశాలను ఆయన తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శృతి, వైస్ ప్రిన్సిపాల్ సురేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



పహాడీషరీఫ్: ఆమ్ల వర్షంపై వివరిస్తున్న విద్యార్థులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాంకాలనీ నారాయణ పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ఆలోచింపజేసే నమూనాలను ప్రదర్శించారు. ప్రదర్శనలను తిలకించిన నారాయణ పాఠశాలల డీజీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం రవీంద్రబాబు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్, ఏడీ హరిబాబు, వైస్ ప్రిన్సిపాల్స్ స్నేహ, హరిత, ఏఓ రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామస్థాయిలో మరింత విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసిందని ఆరోపించారు. అయినా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాటకు పూర్తిగా కట్టుబడి ఉండి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి ప్రజలకు వివరిస్తామని, ఇందుకుగాను పార్టీ నాయకులు, కార్యకర్తలను సిద్ధం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. నాయకులు బాబర్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, వీరేశం, జంగ నర్సింహ్మ, రాజు, సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, తిరుపతిరెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై షార్ట్ ఫిలిం



షూటింగ్‌లో డీపీఎం స్వర్ణలత, మహిళలు

నందిగామ: రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలకు సంబంధించి డీఆర్డీఏ, సెర్ప్‌లలో రుణాలు తీసుకొని లబ్ధి పొందుతున్న వారిపై డీపీఎం స్వర్ణలత ఆధ్వర్యంలో శనివారం మండలంలోని చేగూరులో షార్ట్ ఫిలిం షూటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రధానంగా ఆర్థికంగా నిలబడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సహిస్తోందని, అందులో భాగంగా డీఆర్‌డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో రుణాలు తీసుకొని స్వయం ఉపాధి పొందుతున్న వారి గురించి షార్ట్ ఫిలిం తీస్తున్నామన్నారు. స్వయం ఉపాధి పొందుతున్న తీరును మహిళా సంఘాలకు వివరిస్తున్నామన్నారు.

నిధులు రాక.. పనులు సాగక

- నిలిచిన మార్కెట్‌యార్డ్ నిర్మాణ పనులు
- రెండేళ్లుగా ముందుకు సాగని వైనం



అసంపూర్తి నిర్మాణంలో తుక్కుగూడ సమీకృత మార్కెట్ యార్డ్

తుక్కుగూడ: ప్రజలకు కూరగాయలు, పండ్లు, మాంసం తదితర నిత్యావసర సరకులు ఒకే ప్రదేశంలో లభించాలన్న ఉద్దేశంతో.. గత ప్రభుత్వం పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్ యార్డ్‌ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అయితే పూర్తి స్థాయిలో నిధులు అందక పోవడంతో నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

అసంపూర్తిగా భవనం ..

తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో సమీకృత మార్కెట్ యార్డ్‌ను ప్రస్తుత వారాంతపు సంత ప్రదేశంలో 2022లో నాటి మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్.. రూ.4.5 కోట్లతో నిర్మాణ పనులను ప్రారంభించారు. భవన నిర్మాణ పనులు మొదట్లో వేగంగా జరిగాయి. రెండు అంతస్తుల వరకు పై కప్పు పనులు పూర్తయ్యాయి. ఈ క్రమంలో గుత్తేదారులకు ప్రభుత్వం నిధులు సమకూర్చక పోవడంతో రెండేళ్లుగా నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

అసాంఘిక కార్యకలాపాలకు..

నిర్మాణంలో ఉన్న మార్కెట్ యార్డ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రి వేళలో నిత్యం మందుబాబులు పార్టీలు చేసుకోవడంతో యార్డు, పరసరాలు చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. అసౌకర్యంగా భావించిన ప్రాంత ప్రజలు.. పుర అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సమీకృత మార్కెట్‌కు అధికారులు రక్షణ వలయాలు ఏర్పాటు చేశారు.

ప్రత్యేకాధికారి పరిశీలన

నిర్మాణంలో ఉన్న సమీకృత మార్కెట్‌ను మున్సిపల్ ప్రత్యేక అధికారి(సీడీఎంఏ జేడీయూ) శ్రీనివాస్ గత నెలలో పుర అధికారులతో కలిసి పరిశీలించారు. మార్కెట్ నిర్మాణం ఏ దశలో ఉంది, పనులు ఎందుకు నిలిచిపోయాయో తెలుసుకున్నారు. నిర్మాణం పూర్తి కావడానికి నిధులు ఏ మేరకు కావాలో ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

పనులు పూర్తి చేయాలి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సమీకృత మార్కెట్ కోసం నిధులు కేటాయించింది. పనులు ప్రారంభించింది. సగం వరకు పూర్తయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం నిధులు ఇవ్వక పోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వెంటనే నిధులు విడుదల చేసి, పనులు పూర్తి చేయాలి

– బాదావత్ రవినాయక్, మాజీ కౌన్సిలర్

త్వరలో ప్రారంభం

సమీకృత మార్కెట్ యార్డ్‌కు ప్రభుత్వం.. పెండింగ్ నిధులను విడుదల చేసింది. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయిస్తాం. అనంతరం వినియోగంలోకి తెచ్చేందుకు కృషిచేస్తాం.

– ఎ.యాదయ్య, డీఈఈ తుక్కుగూడ



డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

తండాల్లో వసతుల కల్పనే లక్ష్యం

కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు నేనావత్ రాజునాయక్

మహేశ్వరం: గిరిజన తండాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని పార్టీ ఎస్టీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు, మాజీ ఉపసర్పంచ్ నేనావత్ రాజునాయక్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండా గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న కొత్త తండాలో రూ.9.50 లక్షల నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండాల్లో మౌలిక వసతులు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు, తాగునీటి వసతుల కల్పన, వీధి దీపాల ఏర్పాటుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా నిధులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సహకారంతో నిధులు మంజూరయ్యాయని, ఆయనకు తండా ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజునాయక్, నాయకులు కె.రవి నాయక్, ఎస్.రవినాయక్, అడ్వకేట్ శ్రీను, కె.మోహన్‌నాయక్, ఎం.రాజు నాయక్, గన్ను నాయక్, ఎస్.హరియా, నర్సింహ పాల్గొన్నారు.

వర్గీకరణ పోరుకు సిద్ధం కావాలి



షాద్‌నగర్: అమరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



చేవెళ్లలో నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహమాదిగ

షాద్‌నగర్: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అమరులైన మాదిగ అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు శనివారం షాద్‌నగర్ పట్టణ చౌరస్తా వద్ద అమరుల చిత్రపటానికి నివాళులర్పించారు. మందకృష్ణ మాదిగ సారథ్యంలో అందరూ పోరుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, సుదర్శన్, బొబ్బిలి పాండు, చెన్నగళ్ల శ్రావణ్, యాదయ్య, సురేశ్, వెంకటేశ్, మహేందర్, శివకుమార్, ప్రేమ్‌కుమార్, చెన్న కేశవులు, శివ, నర్సింహ, ఉదయ్, మధు, కార్తీక్ పాల్గొన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: వర్గీకరణ పోరాటంలో అమరులైన మాదిగ అమరవీరుల త్యాగం ఎప్పటికీ మరువలేనిదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్యాసారం శంకర్‌రావుమాదిగ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్, పూలే విగ్రహాల ఎదుట శనివారం మాదిగ అమరవీరుల చిత్రపటానికి మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ సంఘాల నాయకులు యాదయ్య, గంగారం నరేశ్, గాజులగూడా వెంకటేశ్, శాంతికుమార్, చందు, శివగల విజయ్‌కుమార్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

వృథా కాదు

షాబాద్: ఎమ్మార్పీఎస్ అమరవీరుల త్యాగం వృథా కాదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్యాసారం శంకర్‌రావుమాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అక్కమొళ్ల జంగయ్య పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద ఎమ్మార్పీఎస్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు ముక్కు విశ్వంమాదిగ, మండల అధికార ప్రతినిధి మల్కి ప్రవీణ్, నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు త్వరలో అద్దాల పంపిణీ

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: కంటి సమస్యలు ఉన్న విద్యార్థులకు త్వరలో అద్దాలను పంపిణీ చేస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో గత 11రోజులుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. చివరి రోజు శనివారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని డాక్టర్ విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల కంటి సంరక్షణకు చర్యలు చేపట్టిందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లు, టీవీలను అధికంగా చూడటంతో కంటి సమస్యలు తలెత్తుతాయని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. బాగా వెలుతురు ఉన్న ప్రాంతంలో విద్యార్థులు చదువుకోవాలని, పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తినాలని పేర్కొన్నారు. గత 11 రోజులుగా నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరంలో శంషాబాద్, మహేశ్వరం, ఆమనగల్లు, షాద్‌నగర్ ప్రాంతాలకు చెందిన 3,508 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. దృష్టి లోపం ఉన్న వారికి త్వరలో వారి పాఠశాలలు, హాస్టళ్లలో అద్దాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్లు మాధవీలత, విజయలక్ష్మి, సౌజన్య, పద్మలత, పుష్పలత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు 25శాతం రిబేట్

శంకర్‌పల్లి: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు మార్చి 31వరకు 25శాతం రిబేట్ కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ యోగేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న వారికి, అదేవిధంగా ఈ నెల 31వరకు చేసుకునేవారికి అవకాశం ఉందని, క్రమబద్ధీకరించుకొని వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్చి 31వరకు అవకాశమని, తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్త దరఖాస్తులను స్వీకరించేది లేదని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని, సందేహాలు ఉన్నవారు నివృత్తి చేసుకోవచ్చని స్పష్టం చేశారు.



ఆలయంలో గణపతి హోమం నిర్వహిస్తున్న వేదపండితులు, ఉత్సవ కమిటీ సభ్యులు

కనుల పండువగా రథోత్సవం

మహేశ్వరం: శ్రీశివగంగ రాజరాజేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఐదో రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి ఆలయ ఆవరణంలో గణపతి హోమం, రుద్రహోమం నిర్వహించి అనంతరం శనివారం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయంలో రథాన్ని పూలతో అలంకరించి స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపైన పెట్టి ఊరేగించారు. భక్తులు స్వామివారి రథాన్ని వీధుల్లో ఊరేగించి తిరిగి ఆలయం వద్దకు చేర్చారు. జబర్దస్త్ ఫేమ్ కొమురక్క స్కిట్లు, డైలాగ్‌లతో భక్తులను అలరించారు. గ్రామానికి చెందిన విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, భజనలు, జానపద, భక్తిగీతాల ఆలాపన, విన్యాసాలు చేసి అబ్బురపరిచారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, ఆలయ డైరెక్టర్లు మోదిని రాకేశ్, ఒగ్గు శంకర్, పెయ్యల సువర్ణ, పోతర్ల తిరుపతయ్య, గడ్డగూటి నరేశ్, ఏపూరి సాయిలు, కనగట్ల శ్రీశైలం, ఆలయ ఈఓ మురళీకృష్ణ, ఆలయ మాజీ చైర్మన్లు నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, కూన యాదయ్య, కాకి ఈశ్వర్, మునగపాటి నవీన్, కాకి కుమార్, నాగేశ్వర్, మాజీ ఆలయ డైరెక్టర్ కర్రోళ్ల చంద్రయ్య,కర్రోళ్ల భానుచందర్, మాజీ సర్పంచ్ ఆనందం, ఎంపీటీసీ మాజీ సభ్యులు పోతర్ల సుదర్శన్‌యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్లు పోల్కం బాలయ్య, కడమోని ప్రభాకర్, ఆలయ ప్రధాన పూజారి వీరేశం, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా మహేశ్వరం జోన్ ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు బందోబస్తు నిర్వహించారు.



స్కిట్లతో అలరిస్తున్న జబర్దస్త్ ఫేమ్ కొమురక్క



రథాన్ని లాగుతున్న భక్తులు

అమరుల త్యాగాలు వృథా కానివ్వం

ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్లబాబు మాదిగ



అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కందుకూరులో..

మహేశ్వరం: మాదిగల హక్కుల కోసం పోరాటం చేసి అమరులైన వారి త్యాగం వృథా కానివ్వమని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్లబాబు మాదిగ అన్నారు. మండల కేంద్రంలో డా.బీఆర్.అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో ఏబీసీడీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన మాదిగ అమరవీరుల చిత్రపటానికి శనివారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గట్టగళ్ల ప్రశాంత్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బక్కని రవిమాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్ మాదిగ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద శనివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణకు ఎంతో మంది త్యాగాలు చేశారని, వారిని స్మరించుకోవాల్సిన అవసరం మాదిగ జాతికి ఎంతో ఉందని ఈ సందర్భంగా కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు జి.జంగయ్య, నాయకులు చిర్ర సాయిలు, కొమ్మగళ్ల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్‌లో..

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి బాలాపూర్‌లోని శివాజీచౌక్ వద్ద శనివారం ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి త్యాగాలు స్మరించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధికార ప్రతినిధి బొర్ర రవి మాదిగ, మస్కూరి శ్రీశైలం, ఎం.సుధాకర్, సురేశ్, నర్సింహ, గట్టు శ్రీనివాస్, ప్రకాశ్, మైలాలి శ్రీను, రవి తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

చేవెళ్ల: దామరగిద్ద గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మాజీ సర్పంచ్ ఎం.వెంకటేశంగుప్తా అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్దలో శనివారం రూ.10లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, యువకులు మాల నర్సింలు, అంజయ్య, అనిల్, బోడ రామయ్య, మల్లేశ్, శేఖర్, స్వామి భీంరాజ్, కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిపై 'కార్పొరేట్'లకు చిత్తశుద్ధి లేదు

ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్

చేవెళ్ల: కార్పొరేట్ విద్యాసంస్థలకు విద్యాభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని, కేవలం వ్యాపారమే వారి ధ్యేయంగా పనిచేస్తున్నారని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ క్లోం సూర్యప్రకాశ్ అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలను శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో తనిఖీ చేసి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్లలోని శ్రీచైతన్య పాఠశాలలో 9, 10వ తరగతులకు ఎలాంటి పర్మిషన్ లేదని, దీనిపై పలుమార్లు విద్యాధికారులు తనిఖీ చేసి సీజ్ చేసినా పాఠశాల యాజమాన్యం మళ్లీ తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు చందు, మహిపాల్, ప్రదీప్, ప్రేమ్, ఆకాశ్, వెంకటేశ్, ప్రకాశ్, రాజేశ్, అశోక్, తీరు, రోహిత్, నితిన్, నరేశ్, విద్యార్థులు ఉన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



శంకర్‌పల్లి జట్టుకు బహుమతి అందజేస్తున్న శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

షాబాద్: షాబాద్ పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించేందుకు తమవంతు కృషి చేస్తామని శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం దివంగత పట్నం రాజేందర్‌రెడ్డి 37వ వర్ధంతిని పురస్కరించుకొని గత వారం రోజులుగా దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి స్మారకార్థం నిర్వహించిన నియోజకవర్గస్థాయి, క్రికెట్, వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి బహుమతులు అందజేశారు. క్రికెట్ పోటీల్లో శంకర్‌పల్లి జట్టు మొదటి బహుమతి సాధించగా.. వారికి రూ.2లక్షల రూపాయల నగదు మెమొంటో, రెండో బహుమతిగా నిలిచిన చేవెళ్ల జట్టుకు రూ.1లక్ష నగదు, మెమొంటో అందజేశారు. వాలీబాల్‌లో మొయినాబాద్ జట్టు ప్రథస్థానంలో నిలువగా వారికి రూ.50వేల నగదు, మెమొంటో, రెండోస్థానంలో నిలిచిన పీఆర్‌ఆర్ జట్టుకు రూ.25వేల నగదు, మెమొంటోను అందజేసి, సత్కరించారు. పట్నం అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తన తండ్రి దివంగత నేత రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గూడూరు నరసింగ్‌రావు, శ్రీరాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వెంకటయ్య, నక్క శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, క్రీడా నిర్వాహకులు మహేశ్‌యాదవ్, రమేశ్‌యాదవ్, ధనుంజయ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు, నాయకులు తదితరులు ఉన్నారు.

గులాబీ గూటికి మాజీ ఎంపీపీ

కేటీఆర్ సమక్షంలో 300ల మందితో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

శంకర్‌పల్లి: మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి బీజేపీ నుంచి తిరిగి సొంత గూటి(బీఆర్‌ఎస్)కి చేరుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితారెడ్డి సమక్షంలో సుమారు 300 మంది(బీజేపీ, కాంగ్రెస్) అనుచరులతో కలిసి ఆయన బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్.. గోవర్ధన్‌రెడ్డికి కండువా గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ, కేసీఆర్, కేటీఆర్ నాకు రాజకీయంగా ఎంపీపీగా నిలబడేందుకు అవకాశం కల్పించారని, కొంత మంది వ్యక్తుల అనవసర ఆరోపణలు నమ్మి పార్టీ మారాల్సి వచ్చిందని గుర్తుచేసుకున్నారు. ఇప్పటి నుంచి బీఆర్‌ఎస్ పార్టీలోనే చివరి వరకు ఉండి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని, కేటీఆర్ మార్గ నిర్దేశంలో పనిచేస్తానని స్పష్టం చేశారు. మాజీ ఎంపీపీతో పాటు, మాజీ సర్పంచ్ శ్రీధర్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.